క్లుప్తంగా

## విద్యార్థులు ఇష్టపడి చదవాలి



నవాబుపేట: పరీక్షల వేళ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణుడు మల్లయ్య సూచించారు. శనివారం మండల కేంద్రంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు అనగానే ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా ఉండాలని వివరించారు. లక్ష్యం ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగ్యానాయక్, సీఆర్‌పీ జనార్దన్ తదితరులు ఉన్నారు.

## అడ్డాకులలో సైన్స్ ప్రతిభ పరీక్ష



అడ్డాకుల: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సైన్స్ ల్యాబ్, డ్రీం కోర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి సైన్స్ ప్రతిభ పరీక్ష నిర్వహించారు. కందూర్, శాఖాపూర్ పాఠశాలలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. తెలుగు మీడియంలో మొదటి, రెండు, మూడో స్థానాల్లో ఉమాదేవి, ఈశ్వర్, రెహానా బేగం దక్కించుకున్నారు. ఇంగ్లిష్ మీడియంలో మొదటి, రెండు, మూడో స్థానాల్లో ప్రవీణ్‌గౌడ్, శిరీష, నందిని నిలిచారు. విజేతలకు ఎంఈఓ కురుమూర్తి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, నిర్మల, రాములు, చెన్నయ్య ఉన్నారు.

## వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలి



దేవరకద్ర: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ బలరాం ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం ఎమ్మార్సీలో జరిగిన హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన తప్పక పాటించాలని సూచించారు. మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ పీఎస్, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలను ఎంఈఓ తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల బోధన విధానాన్ని, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

## సీసీ రోడ్డు పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్‌నాయక్, రఘు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ హయాంలోనే టెండర్లు పూర్తి

భూత్పూర్: మున్సిపాలిటీలోని 10వార్డుల్లో ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి శంకుస్థాపన చేసిన పనులు బీఆర్‌ఎస్ హయాంలోనే టెండర్లు పూర్తయినట్లు ఆపార్టీ నాయకులు వెల్లడించారు. శనివారం భూత్పూర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. 10వార్డులో డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులతో పాటు నూతనంగా ట్రాక్టర్ల కొనుగోలు తమ పార్టీ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ మంజూరు చేసినట్లు తెలిపారు. కాగా రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తాము మంజూరు చేశామని ఎమ్మెల్యే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ నాయకుడు మహ్మద్ సాదిక్, నాయకులు నారాయణగౌడ్, మురళీధర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం రాములు, యాదయ్య, సురేష్‌గౌడ్ ఉన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట



ఉర్దూఘర్, షాదీఖానా నిర్మాణాల కోసం గతంలో ఎమ్మెల్యే యెన్నంకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం సంఘాల ప్రతినిధులు(ఫైల్)

- నియోజకవర్గంలో కోట్లాది నిధులతో అభివృద్ధి పనులు
- రూ.25 కోట్లతో షాదీఖానా, రూ.15కోట్లతో ఉర్దూ ఘర్
- ఇతర పనులకు మరిన్ని నిధుల మంజూరు

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మైనార్టీల సంక్షేమానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయలతో అసెంబ్లీ నియోజకవర్గంలో మైనార్టీలకు సంబంధించి పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. జిల్లా కేంద్రం అంబేడ్కర్ కళాభవన్ సమీపంలోని పాత యూజీసీఎస్‌కే వద్ద ఉర్దూ ఘర్ నిర్మాణం కోసం రూ.15 కోట్లు మంజూరయ్యాయి. అధునాతనమైన వసతులతో నాలుగు అంతస్తుల్లో దీనిని నిర్మించనున్నారు. వీటిలో లైబ్రరీతో పాటు ఇతర వసతులు ఏర్పాటు చేయనున్నారు. షాదీఖానా కోసం రూ.25 కోట్లు కేటాయించారు. ఎకరా స్థలంలో అన్ని వసతులతో కూడిన షాదీఖానా అందుబాటులోకి రానుంది. ముస్లిం శ్మశానవాటికల ప్రహరీ కోసం రూ.5 కోట్లు మంజూరయ్యాయి.

**ముస్లింల హర్షం**

నియోజకవర్గంలో మైనార్టీల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించడంపై ముస్లింలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ జామియా మజీద్‌లో అభివృద్ధి పనులకు రూ.1.50కోట్లు, ఈద్గా ర్యాంప్ కోసం రూ.1.80కోట్లు, రూరల్ ప్రాంతాల్లో శ్మశాన వాటికల అభివృద్ధి కోసం రూ.30లక్షలు, జహంగీర్‌పీర్ ఐటీ భవనానికి రూ.కోటి, పట్టణంలోని మజీద్‌లలో అదనపు గదులు, బాత్‌రూంలకు రూ.కోటి, అహ్లెహదీస్ ఈద్గా అభివృద్ధి, షెడ్ ప్రహరీకి రూ.50 లక్షలు, మదీనా మజీద్ కమ్యూనిటీహాల్ అభివృద్ధికి రూ.25 లక్షలు, గోల్ మజీద్ కమ్యూనిటీహాల్ అభివృద్ధికి రూ.25లక్షలు, మైనార్టీ వర్కింగ్ వుమెన్ హాస్టల్‌కు రూ.కోటి, మహిళలకు టైలరింగ్ సెంటర్‌కు రూ.35లక్షలు కేటాయించారు. మరికొన్ని పనులకు నిధులు మంజూరయ్యాయి.

**గత ప్రభుత్వం చేసిందేమీలేదు**



బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముస్లింలకు చేసిందేమి లేదు. హామీలు ఇచ్చి మరిచిపోయారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ముస్లింలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారు.

– సిరాజ్‌ఖాద్రీ, కాంగ్రెస్ నాయకుడు

**అభివృద్ధిని చేతల్లో చూపిస్తున్నారు..**



పదేళ్లుగా కేవలం ప్రచారానికి పరిమితమైన అభివృద్ధిని చేతల్లో చూపిస్తున్నారు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి. గత ఎన్నికల్లో ముస్లింల ప్రధాన డిమాండ్లు అయిన షాదీఖానా, ఉర్దూ ఘర్ నిర్మాణం కోసం రూ.40కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ అనుమతులు తీసుకురావడం అభినందనీయం.

– షేక్ ఫారుఖ్ హుస్సేన్, ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు

## నిధులు కేటాయించాలని కలెక్టర్‌కు వినతి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్రంలో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలంటూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ విజయేందిర బోయికి ఆకమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తామని అధికారంలోకి వచ్చిందని, కానీ ఈ సంవత్సరం కూడా కేవలం 7.3శాతం మాత్రమే నిధులు కేటాయించడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహమూద్, వెంకటేశ్వర్లు, శ్రీశైలం, మల్లయ్య, నాగేశ్వర్, ఓంకార్, ఆశప్ప, సృజన, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు



నవాబుపేట: స్థానిక జెడ్పీ పాఠశాలలో 1993–94, 2005–06 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు శనివారం సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులను వారు ఘనంగా సన్మానించి పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. పాఠశాల అభివృద్ధిలో తాము భాగస్వాములుగా మారుతామని వారు వివరించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ప్రమీల, చంద్రకళ, విద్యార్థులు బ్రహ్మం, రఘు, బాల్‌రాజ్, రాఘవులు, సురేష్, గోపాల్, శకుంతల, మంజుల, సువర్ణ, శారద, శివజ్యోతి, నిర్మల తదితరులు ఉన్నారు.

# సమస్యల పరిష్కారానికి చర్యలు

- మున్సిపల్ చైర్ పర్సన్ పుష్పలత



25వ వార్డులో మురికి నీటి నిల్వ ఉన్న ప్రాంతం పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత అన్నారు. శనివారం 25వ వార్డు జౌళినగర్‌లో ఆమె పర్యటించారు. కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏపుగా పెరిగిన ముళ్లపొదలు, కంపచెట్లు వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ ప్రకటించారు. అలాగే మురికి కాలువలు పరిశీలించారు. రెండు చోట్ల డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు ఆమెకు విన్నవించారు. కార్యక్రమంలో ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు అజారుద్దీన్, నాయకులు మహమ్మద్ రఫీ, ఉమర్, కుద్దూస్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను అణచివేసేందుకు కుట్ర



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న బీసీ బహుజన రాజ్యాధికార సమితి నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీలను అణచివేసేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నిందని బీసీ బహుజన రాజ్యాధికార సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మైత్రియాదయ్య ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతు శనివారం అంబేడ్కర్ విగ్రహానికి ఆసమితి నాయకులు వినతి పత్రం సమర్పించారు. అంతకుముందు తెలంగాణ చౌరస్తా నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తాజాగా చేసిన కులగణనలో బీసీలను తగ్గించి చూపడం కుట్రపూరితమేనని అన్నారు. తెలంగాణలో మళ్లీ సంపన్నవర్గాలే రాజ్యమేలుతున్నాయని, బీసీలు యాచించే స్థాయికి పరిమితం చేశారన్నారు. సామాజిక న్యాయంకోసం ఉద్యమానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ మాట్లాడుతూ కొందరు రాజకీయ పార్టీలకు తొత్తులుగా మారి వారిచ్చే తైలాలకు లొంగి బీసీలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీలను చిన్నచూపు చూస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు శివన్న, కృష్ణస్వామి, ముదిరాజ్ సమితి అధ్యక్షుడు పటేల్ రాకేష్, బుక్క మోహన్‌బాబు, తీన్మార్ మల్లన్న టీం అధ్యక్షుడు రవి, అంజయ్య, నగేష్, రవికుమార్, బాలరాజ్ పాల్గొన్నారు.

# పక్కాగా వివరాలు నమోదు చేయాలి



రంగారెడ్డిగూడలో డిజిటల్ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయులు

రాజాపూర్: గ్రామాల్లోని రైతులు సాగుచేసుకున్న పంటల వివరాలను డిజిటల్ క్రాప్‌బుకింగ్ యాప్‌లో పక్కాగా నమోదు చేయాలని జడ్చర్ల డివిజన్ వ్యవసాయ శాఖ సంచాలకులు(ఏడీఏ) ఆంజనేయులు మండల విస్తరణాధికారులకు సూచించారు. శనివారం మండలంలోని సింగమ్మ తండా, రంగారెడ్డిగూడ గ్రామాల్లో ఆయన క్షేత్రస్థాయిలో పంటల డిజిటల్ క్రాప్ బుకింగ్ నమోదును పరిశీలించారు. రైతులు సాగుచేసిన మొక్కజొన్న, వేరుశనగ, వరి పంటలను పరిశీలించి చీడపురుగుల నుంచి తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు రైతులకు తెలపాలని ఏఈఓలకు ఆదేశించారు. మండల వ్యవసాయాధికారి ప్రదీప్‌గౌడ్, ఏఈఓలు దీపికాగౌడ్, శ్రీనివాస్, రమేష్‌రెడ్డి ఉన్నారు.

# ఢిల్లీ గెలుపుపై బీజేపీ సంబరాలు



మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తాలో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. ఢిల్లీ ఎన్నికల్లో ఓటర్లు కాంగ్రెస్ చెప్పిన అబద్ధాలను నమ్మలేదని, అవి నీతి ఆమ్ ఆద్మీపార్టీ పాలన నుంచి విముక్తి కోరుకున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మధ్యాహ్నం పార్టీ కార్యాలయం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఆతర్వాత చౌరస్తాలో బాణసంచా కాల్చి మిఠాయిలు తినిపించుకుని సంబరాలు చేసుకు న్నారు. పద్మజారెడ్డి, బురుజు రాజేందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజు, కొండయ్య, నాగరాజు, సంపత్ పాల్గొన్నారు.

■ మహమ్మదాబాద్ మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు నర్సింహులు ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. మాజీ మండలాధ్యక్షుడు కుర్వకృష్ణ, కార్యదర్శులు కాశీనాథ్, పవన్, ఈశ్వర్, రాజు, రమేష్, నవీన్ అనీల్, కేశవులు, తిరుమలేష్ పాల్గొన్నారు.

■ దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో పాతబస్టాండ్ రోడ్డులో బీజేపీ నాయకులు బాణాసంచాను కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. నాయకులు కృష్ణంరాజు, చంద్రశేఖర్, రాచాల రాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

■ జడ్చర్లలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు బాణసంచా పేల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఎంబీ బాలకృష్ణ, కృష్ణయ్య, ఎడ్లబాలవర్ధన్‌గౌడ్, సాహితిరెడ్డి, బుక్కన వీన్, శ్రీనాథ్, మురళికృష్ణ, మోహన్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు, లక్ష్మి, అంజలి పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన ఎంఈఓ

నవాబుపేట: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి డ్రాయింగ్ పోటీలకు ఎంపికయ్యారు. శనివారం విద్యార్థులు సంజన, చరణ్‌తేజ్, శ్రావణిలను ఎంఈఓ నాగ్యానాయక్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ జనార్దన్, డ్రాయింగ్ మాస్టర్ అన్వర్ పాల్గొన్నారు.

# ఘనంగా స్వయం పాలన దినోత్సవం



కోయిల్‌కొండలో స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని శ్రీవీరభద్ర పాఠశాలలో శనివారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులుగా ఒక్కరోజు పాటు విద్యార్థులు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ రాజేష్, నరసింహ, దివ్య, రాఘవి, రవళి, వైశాలి, తిరుపతమ్మ, అపర్ణ, నస్రీన్, జగదీష్ , జితేంద్ర పాల్గొన్నారు.

**ఉపాధ్యాయులుగా విద్యార్థులు..**

నవాబుపేట: విద్యార్థులు ఒక్క రోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి అందరిని ఆకట్టుకున్నారు. శనివారం మండలంలోని కారుకొండ జెడ్పీ పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి హెచ్‌ఎం దశరథ్‌నాయక్ బహుమతులు అందించారు.

# రైతు సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి
- రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ



దేవరకద్రలో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం దేవరకద్ర మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద దేవరకద్ర, చిన్నచింతకుంట, కౌకుంట్ల మండలాలకు సంబంధించి రూ.90లక్షల విలువగల 49 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రైతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల లోఓల్టేజీ, ఇతర విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దేవరకద్ర, కౌకుంట్ల మండలాధ్యక్షలు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌రెడ్డి, నాయకులు కోన రాజశేఖర్, ఫారూఖ్, రాంపాండు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యారంగానికి పెద్దపీట**

చిన్నచింతకుంట: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం కౌకుంట్ల మండలంలోని ముచ్చింతల, కౌకుంట గ్రామాల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జీఎంఆర్ సేవా సమితి ద్వారా స్టడీ మెటీరియల్ అందజేశారు. అలాగే కోజెంట్ కంపెనీ వారి సహకారంతో పుట్టపల్లి, రాజోలి గ్రామాల విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందుకు సీఎం రేవంత్‌రెడ్డి అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో కోట్ల రుపాయలను ఖర్చుచేస్తూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు విద్యావ్యవస్థను పట్టించుకోలేదన్నారు. కోజెంట్ కంపెనీ వారు విద్యార్థులకు సైకిళ్లు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి కిషన్‌రావు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 11న బహిరంగ వేలం

అడ్డాకుల: కందూర్ శివారులోని శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 11న ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రాజేశ్వరశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయల విక్రయం, లడ్డూ, పులిహోర ప్రసాదాలు, తలనీలాలు పోగు చేసుకొనుటకు ఆలయం వద్ద వేలం నిర్వహిస్తామని, ఆసక్తి కలవారు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

## జేపీఎన్‌సీలో ప్రేరణ తరగతులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీ కళాశాలలో శనివారం విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మోటివేషనల్ స్పీకర్ ఆనంద్ హాజరై ప్రసంగించారు. చదువుకునే వయస్సుల్లో విద్యార్థుల మొదటి కర్తవ్యం చదువే అన్న దాన్ని సమర్థవంతంగా పూర్తి చేసినప్పుడు మాత్రమే జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు అవకాశాలున్నాయన్నారు. జ్ఞాపకశక్తిని మెరుగుపర్చుకొని చదువులపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రవికుమార్, రచయిత కోటల సాయితేజ, ఆనంద్, పుష్పలత, దీప్తి, దివ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ‘ఎన్టీఆర్’లో భీష్మ ఏకాదశి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా భీష్మ ఏకాదశి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకురా లు వాసంతి మాట్లాడుతూ భీష్మ ఏకాదశి గొప్పదనాన్ని వివరించారు. అంపశయ్యపై భీష్ముడు నెలరోజుల పాటు ఉన్నప్పుడు పాండవులకు చేసిన ఉపదేశం ప్రతిఒక్కరి జీవితాన్ని ప్రభావితం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని వేములస్టేజీ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. వివరాలు.. అడ్డాకుల మండలం రాచాలకి చెందిన జాహంగీర్ మహబూబ్‌నగర్‌లో ఉంటూ వేముల వద్ద ఉన్న ఎస్‌జీడీ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. మహబూబ్‌నగర్ నుంచి కంపెనీకి స్కూటీపై వెళ్లే క్రమంలో హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న కారు స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జాహంగీర్‌కు తీవ్రగాయాలు కాగా అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## తెలంగాణకు తీవ్ర అన్యాయం



మహబూబ్‌నగర్ రూరల్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడియాల మోహన్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ఈనెల 10న ప్రజాసంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్కు నిర్వహించ తలపెట్టిన మహాధర్నా పోస్టర్లను శనివారం కోటకదిర గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ల ప్రయోజనాలకు ఉపయోగపడేలా ఉందని అన్నారు. సామాన్య ప్రజలకు లబ్ధి చేకూరేట్లుగా బడ్జెట్ లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సిములు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ ఆటోలకు తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలని సీఈఈ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం వెంకటేశ్వరకాలనీ, శ్రీనివాస కాలనీ, మెట్టుగడ్డ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడబడితే అక్కడ చెత్త వేయొద్దన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి, జవాన్ సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

## వైభవంగా శివస్వాముల మహా పడిపూజ



జడ్చర్ల టౌన్: పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీలోని రాందాస్‌నాయక్ గృహంలో శనివారం ద్వాదశ జ్యోతిర్లింగ(శివస్వాము)ల మహా పడిపూజను వైభవంగా నిర్వహించారు. గురుస్వాములు విజయ్‌కుమార్, ద్యాసమోని కృష్ణయ్య ఆధ్వర్యంలో ముందుగా కలశపూజ, గణపతి, కుమారస్వామి పూజలు చేసిన అనంతరం శివలింగానికి పంచామృతాభిషేకం జరిపించారు. 12మెట్ల పడిని అలంకరించి శివపార్వతులకు పూజలు చేశాక పడిని వెలిగించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శివస్వాములు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పడిపూజ సందర్భంగా శివభక్తులు పాడిన పాటలు, భజనలతో ఆప్రాంతం మార్మోగింది.